క్లుప్తంగా

ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ లక్ష్మీ సుభద్ర

ఏలూరు (టూటౌన్): పబ్లిక్ హెల్త్ అవుట్‌రిచ్ కార్యక్రమంలో భాగంగా ఆయుష్ డిపార్టుమెంట్ కమిషనర్, ప్రాంతీయ ఉపసంచాలకులు ఏలూరు వారి ఆదేశాల మేరకు స్థానిక నాలుగో డివిజన్ లంబాడీపేటలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. సీనియర్ డాక్టర్ కె.లక్ష్మీ సుభద్ర రోగులకు వైద్య పరీక్షలు చేశారు. రక్తహీనత, ఎముకలు, కీళ్ల నొప్పులు, రక్త భారం, సీజనల్ వ్యాధులకు సంబంధించిన మందులను రోగులకు అందజేశారు. ఈ శిబిరాన్ని 150 మంది స్థానిక ప్రజలు వినియోగించుకున్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు, ఏఎన్ఎం తదితరులు పాల్గొన్నారు.

జాతీయ జెండాల పంపిణీ



జాతీయ జెండాలు పంచుతున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): ప్రతి ఇంటిపైనా త్రివర్ణ పతకం ఎగురవేయడం ద్వారా నేటితరం యువతలో జాతీయ భావం పెరుగుతుందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నడపన దాన భాస్కరరావు అన్నారు. బీజేపీ కేంద్ర కమిటీ పిలుపు మేరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా సత్రంపాడు ఎంఆర్‌సీ కాలనీలో జెండాలు పంపిణీ చేశామని భాస్కరరావు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఇట్టాల కృష్ణారావు, పాలేటి రంగారావు, అగ్రహారపు వెంకటేశ్వరరావు, చేకూరి గణపతి, మేకల శ్రీకృష్ణదేవరాయలు, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

ధైర్యలక్ష్మిగా సౌభాగ్యలక్ష్మి



ఆదిలక్ష్మి అలంకరణలో సౌభాగ్యలక్ష్మి

ఏలూరు (ఆర్ఆర్ పేట): స్థానిక సత్రంపాడు సౌభాగ్యలక్ష్మి ఆలయంలో శ్రావణ మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సామూహిక కుంకుమ పూజ చేసి, మంగళగౌరీ వ్రతాలు ఆచరించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ధైర్యలక్ష్మి అలంకరణ చేశారు.

కేరళ బాధితులకు విరాళాల సేకరణ



విరాళాలు సేకరిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): కేరళలోని వయనాడ్ బాధితుల సహాయార్థం మంగళవారం ఐద్వా, బాలల సంఘం ఆధ్వర్యంలో స్థానిక మౌలానా అబ్దుల్ కలాం ఉర్దూ పాఠశాలలో విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.హైమావతి మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు కేరళలోని వయనాడ్ ప్రాంతంలో కొండ చరియలు విరిగిపడి 400 మందికి పైగా ప్రజలు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులను ఆదుకోవడానికి ప్రజా సంఘాలు విరాళాలు సేకరిస్తున్నట్టు చెప్పారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు సేకరించిన రూ.2,290ను సీఐటీయూ నాయకులు పి.కిషోర్, బి.జగన్నాథరావులకు అందజేశారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు జె.హరీషా దుర్గ, బాలల సంఘం ధీరజ్, యశ్వంత్, ఆదాలి, ఫాతిమా పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధికి గ్రహణం

- రెండు నెలలైనా స్పందించని ప్రభుత్వం
- లబ్ధిదారుల అసంతృప్తి
- వైఎస్సార్ సీపీ హయాంలో పేదలకు రూ.266.07 కోట్ల లబ్ధి
- కూటమి ప్రభుత్వంలో పేదలకు అయోమయం



పథకాల లబ్ధి అందుకున్న బ్రోచర్‌ను చూపుతున్న మాదేపల్లి డ్వాక్రా సంఘాల సభ్యులు (ఫైల్)

ఏలూరు రూరల్: టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు పూర్తయింది. పెరిగిన పింఛన్ పంపిణీ తప్ప మిగిలిన సంక్షేమ పథకాల అమలుకు ఏ చర్యలూ తీసుకోలేదు. అభివృద్ధి పనుల ఊసేలేదు. కొత్త ప్రభుత్వం సంక్షేమ పథకాలను ఎప్పుడు అమలు చేస్తుందా అని లబ్ధిదారులు ఆశగా ఎదురు చూస్తున్నారు. రుణం కోసం చిరు వ్యాపారులు గగ్గోల పెడుతున్నారు. రోడ్ల మరమ్మతులకు చేపట్టిన చర్యలు లేవు. సాగుదారుల సాయంపై అయోమయం నెలకొంది. పేదల ఇళ్ల నిర్మాణాలకు నిధులు విడుదల చేయలేదు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వం స్పందించడంలేదని ప్రజలు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు.

వైఎస్సార్ సీపీ హయాంలో ఆనందోత్సాహాలు

గత ఐదేళ్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు పేదల ఇళ్లలో ఆనందాలు వెల్లువిరిశాయి. రెక్కాడితే డొక్కాడని పేదలు సంక్షేమ పథకాలు అందుకుని ఆర్థికంగా స్థిరపడ్డారు. అమ్మఒడి, జగనన్న వసతిదీవెన, విద్యా దీవెన తదితర పథకాల ద్వారా పేద పిల్లలు కాన్వెంట్, ప్రైవేటు కళాశాల చదువులు సాఫీగా సాగాయి. వాహన మిత్ర, కాపునేస్తం, ఈబీసీ నేస్తం పథకాల ద్వారా కోట్ల రూపాయల ఆర్థిక సాయం అందుకున్న యువత ఉద్యోగం, వ్యాపార రంగాల్లో ప్రతిభ చాటారు. రైతు భరోసా, ఇన్‌పుట్ సబ్సిడీ పథకాలతో రైతులు వ్యవసాయం, చేపల సాగు రంగంలో విప్లవాత్మక మార్పు సాధించారు. సున్నా వడ్డీ, వైఎస్సార్ చేయూత పథకాలతో వేల కోట్ల రూపాయలు అందుకున్న డ్వాక్రా సంఘాలు ఆర్థిక స్వావలంబన వైపు అడుగులు వేశారు. వైఎస్సార్ సీపీ హయాంలో దెందులూరు నియోజకవర్గం, ఏలూరు రూరల్ మండలంలో 15 గ్రామ పంచాయతీల్లో 74,890 మంది సంక్షేమ పథకాలు అందుకున్నారు. వీరిలో 51,578 మంది 25 డీబీటీ పథకాలు (అమ్మ ఒడి, జగనన్న విద్యా దీవెన, రైతు భరోసా, సున్నా వడ్డీ, కాపు నేస్తం, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ తదితర) ద్వారా రూ.159,87,42,591లను నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో నగదు జమైంది. మరో 23,312 మంది లబ్ధిదారులకు ఎనిమిది నాన్ డీబీటీ పథకాలు (ఇంటి స్థలం, విద్యాకానుక, జగనన్న తోడు, గోరుముద్ద, రైస్‌కార్డు, కంటి వెలుగు, వైఎస్సార్ సంపూర్ణ పోషణ, విద్యార్థులకు ట్యాబ్స్) ద్వారా రూ.106,20,56,368లు ఖర్చు కాగల సేవలు అందుకున్నారు.

అందని ఆర్థిక సాయం



మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన వైఎస్సార్ చేయూత పథకం నా కుటుంబానికి ఎంతో అండగా నిలిచింది. ఈ పథకం ద్వారా రూ.50 వేలు అందుకున్నాను. ఈ మొత్తంతో నేను, నా భర్త చేపల వ్యాపారం చేపట్టాం. ఇప్పుడు ఆర్థిక సాయం అందించే నాథుడే కానరావడం లేదు. ఏదైన పథకం ద్వారా లబ్ధి పొందాలన్నా సాధ్యం కావడం లేదు.

– బలే పుల్లమ్మ, కొల్లేరు

పథకాల కోసం ఎదురు చూపు



టీడీపీ అమలు చేసే పథకాల కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారు. ఇప్పటి వరకు పింఛన్ పథకం తప్ప ఏ ఒక్క పథకమూ అమలు చేయలేదు. గత ప్రభుత్వం నెలకు ఒక పథకం అమలు చేసేది. అన్ని వర్గాలకూ లబ్ధి చేకూరింది. టీడీపీ సూపర్ సిక్స్ పథకాలన్నారు.. ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఇస్తామన్నారు. ఉచిత ప్రయాణం అమలు చేస్తాం అన్నారు. నేటికీ అమలు చేయడం లేదు.

– కాటి దాసు, బూరాయిగూడెం

శిక్షణకు సర్పంచ్‌ల డుమ్మా



మల్కాపురంలో నిర్వహిస్తున్న సర్పంచ్‌ల శిక్షణ

ఏలూరు రూరల్ : చెత్త నుంచి సంపద తయారీపై ఏర్పాటుచేసిన శిక్షణ తరగతులకు సర్పంచ్‌లు డుమ్మా కొట్టారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం అధికారులు ఏలూరు రూరల్ మండలం మల్కాపురంలో సర్పంచ్, సెక్రటరీలకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఇందులో స్థానిక సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్డులో చెత్త గ్రేడింగ్, కంపోస్ట్ తయారీ విధానంపై సర్పంచ్‌లకు అవగాహన కార్యక్రమం ఏర్పాటుచేశారు. దీనికి 12 మంది సర్పంచ్‌లు హాజరుకాలేదు. మల్కాపురం, కోటేశ్వరదుర్గాపురం, కొక్కిరాయిలంక సర్పంచ్‌లు మాత్రమే పాల్గొన్నారు. డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఆదేశాల మేరకు అధికారులు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంపై పలువురు సర్పంచ్‌లు పెదవి విరిచారు. గత ప్రభుత్వం గ్రామీణ అభివృద్ధిపై 100 రోజుల ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి అవగాహన కల్పించిందన్నారు. అందులో ఉన్న కార్యక్రమాలనే నేటి ప్రభుత్వం మరోసారి చేస్తోందని గుర్తు చేశారు. దీనివల్ల సమయం వృథా తప్ప ఒనగూరే ప్రయోజనం లేదని పలువురు సర్పంచ్‌లు తమ అభిప్రాయం వ్యక్తం చేశారు.

మైనర్లకు మోటారు సైకిళ్లు ఇవ్వొద్దు



మైనర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై సాధిక్

ఏలూరు టౌన్: మైనర్లకు మోటారు సైకిళ్లు ఇవ్వవద్దని టూటౌన్ ఎస్సై సాధిక్ తల్లిదండ్రులకు సూచించారు. డీఎస్పీ బి.శ్రావణ్‌కుమార్ ఆదేశాల మేరకు ఏలూరు టూటౌన్ సీఐ ప్రభాకర్ ఆధ్వర్యంలో ఎస్సై సాధిక్ టూటౌన్ ప్రాంతంలో మైనర్లకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ప్రమాదం జరిగినప్పుడు బాధపడే కంటే ముందుగానే తమ పిల్లల పట్ల బాధ్యతగా ఉండాలని కోరారు. మోటారు సైకిల్ నడిపే ప్రతి ఒక్కరూ లైసెన్సు కలిగి ఉండడంతో పాటు విధిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. డ్రైవింగ్ లైసెన్సు లేకుండా మోటారు సైకిల్ నడిపితే చట్టం మేరకు రూ.25 వేల జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం



ఏలూరు కలెక్టరేట్‌లో మొక్కను నాటుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు(మెట్రో): మిషన్ శక్తి బేటీ బచావో – బేటీ పడావో కార్యక్రమం క్రింద 100 రోజుల ప్రత్యేక అవగాహన, నషా ముక్త్ అవగాహన కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం స్థానిక కలెక్టరేట్ ప్రాంగణంలో ఐసీడీఎస్ కార్యాలయం వద్ద ఎస్పీ కె.ప్రతాప్ శివకిషోర్, జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డితో కలిసి కలెక్టర్ కె.వెట్రిసెల్వి మొక్కలు నాటారు. పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని, విరివిగా మొక్కలు నాటాలని కలెక్టర్ వెట్రిసెల్వి పిలుపునిచ్చారు. భవిష్యత్తు తరాలకు కాలుష్యరహిత వాతావరణాన్ని అందించాలన్నారు. విచ్చలవిడిగా ప్లాస్టిక్, కర్మాగారాల వ్యర్థాలు, హానికారక రసాయనాల వినియోగం కారణంగా వాతావరణం, వాయువు, జల కాలుష్యాలకు గురవుతున్నాయని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలను పెంచడమేనని, ప్రతిఒక్కరూ పుట్టినరోజు, పెళ్లిరోజు వంటి రోజుల్లో విరివిగా మొక్కలను నాటే అభిరుచిని కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ డి.పుష్పమణి, ఆర్డీఓ ఎన్ఎస్‌కే ఖాజావలి, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఏడీ రాకడమణి, ట్రాన్స్‌కో ఎస్ఈ సాల్మాన్ రాజు, ఏపీఎంఐపీ పీడీ రవికుమార్, డీసీహెచ్ఎస్ పాల్‌సతీష్, ఎస్‌డీసీలు ఎం ముక్కంటి, కె.బాబ్జి, ఐసీడీఎస్ పీడీ పద్మావతి, ఏలూరు నగరపాలక సంస్థ హెల్త్ ఆఫీసర్ మాలతీ, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి ఘంటా సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టుల భర్తీలో రజకులకు న్యాయం చేయాలి



మాట్లాడుతున్న రజక సంఘం అధ్యక్షుడు కట్లయ్య

ఏలూరు (టూటౌన్): రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం నామినేటెడ్ పోస్టుల భర్తీలో రజకులకు ప్రాధాన్యత ఇవ్వాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా రజక సంఘం అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య డిమాండ్ చేశారు. స్థానిక జిల్లా రజక జన సంఘం జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. నామినేటెడ్ పోస్టులైన ఏఎంసీ చైర్మన్, ఫెడరేషన్ చైర్మన్, డైరెక్టర్స్, గ్రంథాలయ చైర్మన్ తదితర వాటిలో రజకులకు ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. రజకుల సంక్షేమానికి అనేక జీఓలు ఇచ్చినప్పటికీ రాష్ట్రంలో 70 శాతం గ్రామాలకు వృత్తి చెరువులను కేటాయించకపోవడం, అధికారులు గ్రామ పంచాయతీల నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమని ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ హయాంలో రజకుల దోబీ ఘాట్‌ల నిర్మాణానికి నిధులు కేటాయించినప్పటికీ క్షేత్ర స్థాయిలో అవి కార్యరూపం దాల్చలేదని తెలిపారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు బడ్జెట్‌లో దోబి గాట్స్‌కు రూ.10 కోట్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. రజక కమ్యూనిటీ హాల్స్ విషయంలో ఎంపీ నిధుల నుంచి ప్రతి ఎంపీ పార్లమెంటు స్థానంలో ఐదు గ్రామాలకు అయినా ఒక్కో గ్రామానికి రూ.10 లక్షల వంతున మంజూరు చేయాలన్నారు. చింతలపూడి రజక కమ్యూనిటీ హాలుకు రూ.10 లక్షలు, కొయ్యలగూడెం మండలం బయ్యన్నగూడెం గ్రామంలో రూ.50 లక్షలు మంజూరు చేశారని, ఆ నిధులు విడుదల చేసి రజక వృత్తిదారులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. సమావేశంలో సంఘం గౌరవ అధ్యక్షుడు పగడాల సాంబశివరావు, విశాల శ్రీనివాస్, కొమ్మంటి మురళి, పి.దుర్గారావు, ఎ.సుబ్రహ్మణ్యం, దేవరపల్లి సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'హర్ ఘర్ తిరంగా'



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు



త్రివర్ణ పతాకాలతో ఎన్‌సీసీ క్యాడెట్స్



సెల్ఫీ పాయింట్ వద్ద కలెక్టర్ వెట్రిసెల్వి, ఎస్పీ శివ కిషోర్, జేసీ ధాత్రిరెడ్డి

ఏలూరు ఇండోర్ స్టేడియంలో మంగళవారం ఉదయం హర్ ఘర్ తిరంగా వేడుక నిర్వహించారు. కలెక్టర్ కె.వెట్రిసెల్వి, ఎస్పీ కె. ప్రతాప్ శివకిషోర్, జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి జాతీయ జెండాతో సెల్ఫీ తీసుకున్నారు. అనంతరం క్రీడాకారుల ర్యాలీని కలెక్టర్ ప్రారంభించారు. ఫైర్ స్టేషన్ సెంటర్ మీదుగా ర్యాలీ కొనసాగింది. త్రివర్ణ పతాకాలతో ఎన్‌సీసీ క్యాడెట్స్, విద్యార్థులు ఆకట్టుకున్నారు.

– సాక్షి ఫొటో గ్రాఫర్ / ఏలూరు

ఆయిల్‌పామ్ రైతుల సమస్యలపై వినతి



ఎంపీ పుట్టాకు వినతిపత్రం అందిస్తున్న రైతులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆయిల్‌పామ్ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఆయిల్ పామ్ రైతుల సంఘం ప్రతినిధులు కోరారు. ఈ మేరకు మంగళవారం నగరంలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఆయిల్‌పామ్‌తో పాటు కోకో, ఇతర ఉద్యాన పంటలపైనా దృష్టి పెట్టాలని, జిల్లాలో చాక్లెట్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని కోరారు. 2022వ సంవత్సరంలో పామాయిల్ దిగుమతిపై 49 శాతం ఉన్న దిగుమతి సుంకాన్ని తీసివేయడంతో గిట్టుబాటు ధరలేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రైతుల సమస్యల పరిష్కారానికి ఢిల్లీలో సంబంధిత కేంద్ర ప్రభుత్వ కార్యదర్శిని కలిశానని, వచ్చే నెలలో తాను మలేషియా వెళ్లి ఆయిల్‌పామ్ వ్యవసాయంపై అధ్యయనం చేస్తానని ఎంపీ పుట్టా చెప్పారని నాయకులు వివరించారు. ఎంపీని కలిసిన వారిలో పెదవేగి ఆయిల్ ఫెడ్ రైతు సంఘం అధ్యక్షుడు ఉండవల్లి వెంకట్రావు, రాష్ట్ర ఆయిల్‌పామ్ రైతు సంఘం అధ్యక్షుడు బొబ్బా రాఘవరావు, జాతీయ ఆయిల్‌పామ్ పార్మర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి క్రాంతి కుమార్, ఆయిల్ పామ్ రైతులు కొసరాజు రాధాకృష్ణ, కొల్లి శ్రీను, ధన కోటేశ్వరరావు, సీహెచ్ హనుమంతరావు తదితరులున్నారు.

దోమల నివారణ చర్యలు

ఏలూరు (టూటౌన్): స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలోని 15వ డివిజన్‌లోని ప్రశాంత్ నగర్, జాలాపరమేశ్వర కాలనీ, గాయత్రి నగర్, తదితర ప్రాంతాల్లో మంగళవారం దోమల లార్వా నిర్మూలనకు పలు కార్యక్రమాలను చేపట్టారు. స్ప్రేయింగ్, మురుగు కాలువ కల్వర్టుల కింద ఫాగింగ్, ఖాళీ స్థలాల్లోని నిలువ నీటిలో ఆయిల్ బాల్స్ వేశామని మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ మాలతి తెలిపారు. ఆయా ప్రాంతంలోని ప్రజలకు సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించామన్నారు. నాయకులు కోన మాణిక్యం, మలేరియా ఇన్‌స్పెక్టర్ దత్తి వేణు గోపాల్ స్వామి, మలేరియా మేస్త్రి డి.దుర్గారావు, కేఎస్ శ్రీనివాసరావు, ఆరోగ్య కార్యదర్శి ఆశా కార్యకర్తలు, డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో టాస్క్ పేరుతో మోసం

రూ.8 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు

ఏలూరు టౌన్: ఏలూరు టూ టౌన్ ప్రాంతానికి చెందిన వ్యక్తి తనను ఆన్‌లైన్ టాస్క్ పేరుతో భారీగా సొమ్ము కాజేసి సైబర్ నేరగాళ్లు మోసం చేశారని పోలీసులకు మంగళవారం రాత్రి ఫిర్యాదు చేశాడు. టూ టౌన్ సీఐ ఎం ప్రభాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరు కొత్తపేట ప్రాంతానికి చెందిన ప్రదీప్ కుమార్ ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. ఇటీవల అతనికి ఆన్‌లైన్‌లో లింక్ ఓపెన్ చేయగాం టాస్కులు ఇస్తామని, వాటిని పూర్తి చేస్తే డబ్బులు సంపాదించే అవకాశం ఉందని నమ్మించారు. అతను దఫాలుగా టాస్కులు పూర్తి చేయటంతో కొంత డబ్బులు అతని బ్యాంకు ఖాతాలో వేస్తూ ఆశ చూపించారు. అలా టాస్కులు ఇస్తూ దఫదఫాలుగా సుమారు రూ.8 లక్షలు కాజేశారు. తాను మోసపోయానని తెలుసుకుని పోలీసులను ఆశ్రయించాడు. సైబర్ పోలీసు సహకారంతో కేసును పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	33
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	33
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	14
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	31

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.45	4820	21
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.15	4822	24
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	21
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	25
ఏలూరు - జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	27
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	30
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	25
ఏలూరు - తిరుపతి	16.00	4830	32

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): శనివారపు పేట సబ్ స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, లైన్ల వార్షిక మరమ్మతుల నిమిత్తం బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ జేపీటీ నటరాజన్ తెలిపారు. శనివారపు పేట, దొండపాడు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు.

ఓటర్ల సర్వే నిర్వహించాలి

ఏలూరు(మెట్రో): సంక్షిప్త సవరణ ఓటర్ల జాబితా తయారీలో భాగంగా ఇంటింటా ఓటర్ల సర్వే నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రధాన కార్యదర్శి వివేక్ యాదవ్ తెలిపారు. అన్ని జిల్లాల కలెక్టర్లు, ఈఆర్‌ఓలతో మంగళవారం ఆయన అమరావతి నుంచి వీడియో సమావేశం నిర్వహించారు. సంక్షిప్త సవరణ ఓటర్ల జాబితా రూపొందించడానికి ఆగస్టు 20 నుంచి అక్టోబర్ 18 వరకు ఇంటింటా ఓటర్ల సర్వే జరుగుతుందని చెప్పారు. ఎన్నికల కమిషన్ సూచించిన మార్గదర్శకాలు పక్కాగా అమలు చేయాలన్నారు.

17న ఏలూరులో మాలల పాదయాత్ర



కరపత్రం విడుదల చేసిన నాయకులు

ఏలూరు (టూటౌన్): ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లకు సంబంధించి ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పునః సమీక్షించాలని మాలజాతి యోధుల పోరాట సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు ఈ నెల 17న ఏలూరులో మాలల శాంతియుత పాదయాత్ర నిర్వహిస్తున్నట్టు పేర్కొంది. స్థానిక నరసింహారావుపేటలోని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర కార్యాలయం వద్ద మంగళవారం పాదయాత్ర కరపత్రాన్ని నాయకులు ఆవిష్కరించారు. ర్యాలీ 17వ తేదీ ఉదయం 10 గంటలకు పాతబస్టాండ్ సెంటర్‌లోని డాక్టర్ అంబేడ్కర్ విగ్రహం నుంచి వసంత మహల్, ఓవర్ బ్రిడ్జి, ఫైర్ స్టేషన్ సెంటర్, జిల్లా పరిషత్ సెంటర్ మీదుగా కలెక్టరేట్‌కు చేరుకుంటుందని నాయకులు తెలిపారు. కలెక్టరేట్‌వద్ద భారీ బహిరంగ సభ ఏర్పాటుచేశామన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో మెండెం సంతోష్ కుమార్, నేతల రమేష్ బాబు, అబ్బూరి అనిల్, నూకపెయ్యి కార్తీక్, కాపుదాసి రవి, మేరుగు సత్యనారాయణ, పాము మాన్ సింగ్, గంటా రాజేశ్వరరావు, పులవర్తి డేవిడ్, ఎరికిపాటి విజయ్ తదితర నాయకులు పాల్గొన్నారు.